క్లుప్తంగా

కుష్ఠు వ్యాధిని సకాలంలో గుర్తించాలి

• డీఎంహెచ్ఓ భాస్కరరావు



లెప్రా సొసైటీ ప్రతినిధికి చెక్కు అందజేస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: కుష్ఠువ్యాధిని సకాలంలో గుర్తించాలని డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నెల్లిమర్ల జీకేఎం ఎజీ కళాశాల పూర్వ విద్యార్థులు 34 మంది కుష్ఠు రోగులకు పాదరక్షకుల నిమత్తం రూ. 12 వేల నగదును డీఎంహెచ్ఓ చేతులమీదుగా లెప్రా సొసైటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీహెచ్ వార్డు వైద్యురాలు దేదీప్య, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించాలి

• ఏపీ రైతు సంఘం



ఏపీ రైతు సంఘ జిల్లా కమిటీ సభ్యుల నిరసన

విజయనగరం అర్బన్: రైతులు నిర్మించుకున్న మినీ గోకులాలకు సంబంధించి బిల్లులు చెల్లించాలని ఏపీ రైతు సంఘ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మినీ గోకులాలు నిర్మించండని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడంతో సొంత డబ్బులతో గోకులాలు నిర్మించామని, అయితే ఇంత వరకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఏడాది కిందట కొంతమేర బిల్లులు చెల్లించినా .. ఇంకా పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదన్నారు. అనంతరం జేసీ మయూర్ అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, సంఘ నాయకులు మిడతాన పరదేశినాయుడు, అప్పల నాయుడు, ముమ్ములూరి ఈశ్వరరావు, గొల్లు చంద్రరావు, కిలపల్లి సత్తిబాబు, గొల్లు ఎర్రన్న, రొంగళి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో రాష్ట్ర ఆహార కమిటీ సభ్యుడి పర్యటన



సంస్కృత పాఠశాలలలో మధ్యాహ్న భోజన పథక నిర్వహణను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిటీ సభ్యుడు కాంతారావు

విజయనగరం రూరల్: రాష్ట్ర ఆహార కమిటీ సభ్యుడు డి.కాంతారావు కార్పొరేషన్ పరిధిలో పర్యటించి పలు పాఠశాలలు, సినిమా థియేటర్లు, రేషన్ దుకాణాలను సోమవారం పరిశీలించారు. బొబ్బాదిపేటలో లబ్ధిదారులకు ప్రజా పంపిణీ వాహనం ద్వారా అందిస్తున్న నిత్యావసర సరుకులను పరిశీలించిన అనంతరం పట్టణంలోని హిమగిరి, సప్తగిరి థియేటర్లలో ఫుడ్‌స్టాల్స్, సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎస్ఓ అశోక్, విజయనగరం, గజపతినగరం సీఎస్‌డీటీలు వీవీఆర్ జగన్నాథరావు, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

లోటుపాట్లు గుర్తించాలి



సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంఈఓలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలపై సచివాలయ సిబ్బంది దృష్టి సారించి లోటుపాట్లను గుర్తించాలని ఎంఈఓలు యూఎస్ఎన్ మూర్తి, విజయ్‌కుమార్ సూచించారు. సచివాలయ సిబ్బందితో మండల కేంద్రంలో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకం, నాడు - నేడు పనులను పరిశీలించి ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం అలుగోలు ఉన్నత పాఠశాలను సందర్శించి నాడు - నేడు పనులను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు అందించారు.

13న ఉచిత మెగా వైద్యశిబిరం

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీలో ఈ నెల 13న ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు చిన్నమాంబ యువజన సేవా సంఘ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆదిత్య పాఠశాలలో ఆ రోజు ఉదయం 9 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రముఖ వైద్యులు ఈ శిబిరంలో పాల్గొంటున్నారని.. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజావసరాలు తీర్చేందుకే రోడ్లు, కాలువల నిర్మాణం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
• నగరంలోని 5వ డివిజన్‌లో రూ.76 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయనగరం: నగర ప్రజల అవసరాలు తీర్చడంలో భాగంగా రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 5వ డివిజన్‌లో రూ.76 లక్షలతో నిర్మించనున్న రహదారులు, కాలువ పనులకు సోమవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. నవాబుపేట ప్రాంతంలో రూ.20 లక్షలతో.. ద్వారకానగర్‌లో రూ.56 లక్షలతో రహదారులు, కాలువ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, నగరంలో అభివృద్ధి పనులు నిరాటంకంగా సాగుతున్నాయన్నారు. ప్రజల కనీస మౌలిక సదుపాయాలను తెలుసుకుంటూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర మి వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. ప్రజావసరాలను గుర్తించడం.. అభివృద్ధి పనులు చేపట్టడం నిరంతర ప్రక్రియగా సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తుంటే.. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అభివృద్ధి కొనసాగిస్తున్నారని కొనియాడారు. కార్పొరేటర్ గాదం మురళి మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఎన్నడూ లేనివిధంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

నేడు కోలగట్ల జలాసన ప్రదర్శన

విజయనగరం: జాతీయ స్విమ్మింగ్ పూల్ డే సందర్భంగా స్థానిక కంటోన్మెంట్ ఆక్వా స్టేడియం (స్విమ్మింగ్ పూల్)లో రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, విజయనగరం శాసన సభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి జలాసనాలు వేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ విజయనగరం నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ తెలిపారు. సోమవారం స్థానిక ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఇప్పటికే రెండుసార్లు జలాసనం వేయడం ద్వారా యువతను ఆకట్టుకున్న కోలగట్ల.. మరోమారు తన ఆసన ప్రదర్శన ద్వారా నేటి తరం దృష్టిని యోగాసనాల వైపు, ఈత వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ జలాసన ప్రదర్శనకు ఉప ముఖ్యమంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలనాయుడు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, స్పీకర్ తమ్మినేని సీతారామ్, హాజరుకానున్నట్లు చెప్పారు. సమావేశంలో కోలగట్ల కృష్ణారావు, తమ్మన్న శెట్టి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే పర్యటనలు



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్లు

• డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్

విజయనగరం: ప్రజల కష్ట, సుఖాలు తెలుసుకోవడంలో భాగంగానే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పేరిట క్షేత్ర స్థాయి పర్యటనలు చేపడుతున్నట్లు నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్ అన్నారు. నగరంలోని 30వ డివిజన్ 12వ నంబర్ సచివాలయ పరిధిలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రావణి, లయాయాదవ్, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా మహిళల బ్యాంక్ ఖాతాలకు అమ్మఒడి, ఆసరా వంటి పథకాలు నేరుగా అందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. అన్నివర్గాలకు సమన్యాయం చేకూర్చే విధంగా ఆర్థిక బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇస్తున్న తోడ్పాటు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. కార్పొరేటర్ నాయన పద్మ మాట్లాడుతూ, తమ డివిజన్‌లో ఎమ్మెల్యే కోలగట్ల సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, నాయన మహేష్, తదితరులు పాల్గొన్నారు.

స్టాకు బోర్డులు ఏర్పాటు చేయాలి

విజయనగరం రూరల్: రేషన్ డీలర్లు దుకాణాల వద్ద సరుకుల వివరాలతో కూడిన స్టాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని సీఎస్‌డీటీ వీవీఆర్ జగన్నాథరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాక్ బోర్డుతో పాటు, రేషన్ దుకాణ సంఖ్య, వీధి, డీలరు పేరు, ఫోన్ నంబర్‌తో కూడిన మరో బోర్డును కూడా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అలా చేయని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

పవన్ కల్యాణ్.. నోరు అదుపులో పెట్టుకో

• టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు



నెల్లిమర్ల రూరల్: వలంటీర్ల వ్యవస్థపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సీతారామునిపేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పవన్‌కల్యాణ్ కంటే బ్రోకర్ రాష్ట్రంలో మరొకరు ఉండరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దాక్కొని నెలకోసారి ఏపీకు వచ్చి చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్టు చదువుతున్నాడని మండిపడ్డారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ గతంలో గాజువాక, భీమవరంలో చిత్తు చిత్తుగా ఓడించారని.. ఈ విషయంలో ముందు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. కోవిడ్ లాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన ఘనత వలంటీర్లకే దక్కుతుందన్నారు. ప్రజలను అడిగితే వలంటీర్ల పనితీరు గురించి చెబుతారన్నారు.

వలంటీర్ల నిరసన..

నెల్లిమర్ల రూరల్: వలంటీర్ల వ్యవస్థపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక రామతీర్థం జంక్షన్ వద్ద వలంటీర్లు పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని దహనం చేస్తూ నిరసన తెలియజేశారు. అనంతరం పలువురు వలంటీర్లు మాట్లాడుతూ, ప్రజలకు నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలను అందించాలనే ఉద్దేశంతో సీఎం జగనన్న తమను నియమించారని, ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు మంచి జరగాలనే తపనతో నిత్యం సేవలందిస్తున్నామని, ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తున్నామన్నారు. కోవిడ్ క్లిష్ట సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని తెలిపారు. పవన్‌కల్యాణ్ తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉదయ ప్రసన్నకుమార్, దుర్గారావు, నరేష్‌కుమార్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

• ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో చేపడుతున్న వెల్‌నెస్, రైతుభరోసా, సచివాలయ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జగనన్న కాలనీ లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో లేకుండా సకాలంలో చెల్లించాలన్నారు. ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు ముందుగా పునాది బిల్లులను వారి ఖాతాల్లో వేసి ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పించాలని హౌసింగ్ డీఈ మురళీకి సూచించారు. నాడు-నేడు ఫేజ్ -2 ద్వారా మండలంలో చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేసి, పనులకు సంబంధించిన రికార్డులను సిద్ధం చేయాలని ఎంఈఓ రమణమూర్తిని ఆదేశించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ అప్పలనాయుడు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు బంగారునాయుడు, వైకుంఠరావు, ఏఓ దాసరి బంగారయ్య, ఈఓపీఆర్‌డీ సురేష్, సీడీపీఓ ఎస్తేరు రాణి, బైరెడ్డి యర్రప్పలనారాయణ, వివిధ శాఖల అధికారులు, సెక్రెటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కారం

• జేసీ మయూర్ అశోక్



మట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయగనరం అర్బన్: జగనన్నకు చెబుదాం వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చే వినతులకు సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలను జేసీ మయూర్ అశోక్ ఆదేశించారు. జగనన్న సురక్ష సర్వేలను శతశాతం పక్కాగా నిర్వహించాలని, తప్పిదాలు జరగకుండా జాగురూకత వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష సర్వే కార్యక్రమాలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో జేసీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సురక్షలో భాగంగా చేపట్టే సర్వేలో ఎలాంటి లోపాలు జరగకుండా పూర్తి పారదర్శకత పాటించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. వలంటీర్లు తప్పకుండా ప్రతి ఇంటికీ వెళ్లి, వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదవుతున్న టోకెన్లకు, అందిస్తున్న సేవలకు వ్యత్యాసం లేకుండా చూడాలని ఆదేశించారు. అలాగే జగనన్నకు చెబుదాం వేదిక ద్వారా ప్రజల నుంచి వస్తున్న వినతులకు సకాలంలో సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని, ఫిర్యాదుదారు అభిప్రాయాన్ని తప్పక నమోదు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న సురక్ష నేడు

విజయనగరం రూరల్: మండలంలోని ద్వారపూడి, సారిక గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంటా వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రెండు సచివాలయాల పరిధిలో..

డెంకాడ: మండలంలోని బొడ్డవలస, చొల్లంగిపేట గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 11 రకాల సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

ఘోషా ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

• మహిళ కడుపులో నుంచి నాలుగు ఫైబ్రాయిడ్స్ తొలగింపు

విజయనగరం ఫోర్ట్: మూడు నెలలుగా తీవ్ర ఇబ్బంది పడుతున్న మహిళకు ఘోషా ఆస్పత్రి వైద్యులు బాధ నుంచి విముక్తి కల్పించారు. ఈ మేరకు వైద్యులు సోమవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి బాధిత మహిళ కడుపులోనుంచి నాలుగు కణితులను తొలగించారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కొత్తపేటకు చెందిన 30 ఏళ్ల అవివాహిత మూడు నెలలుగా తీవ్రరక్తస్రావంతో బాధపడుతోంది. దీంతో ఈనెల 5వతేదీన ఘోషా ఆస్పత్రి ఓపీ విభాగంలో చూపించుకోగా స్కానింగ్‌లో ఆమె కడుపులో పెద్దసైజు ఫైబ్రాయిడ్స్ (కణితులు) నాలుగు, ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం ఆమెకు శస్త్రచికిత్స చేసి ఫైబ్రాయిడ్స్ తొలగించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రప్రభ (గైనకాలజీ), అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మానస, పోస్టు గ్రాడ్యుయేట్ సుభాషిణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ (ఎనస్తీషియా విభాగం), పోస్టు గ్రాడ్యుయేట్ హర్షిణి మహిళకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించడంతో ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ శుభశ్రీ అభినందించారు.

డైట్ ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశం

నెల్లిమర్ల రూరల్: ఈ నెల 12 నుంచి 15 వరకు డైట్, డీఈఎల్ఈడీ ఫెయిల్ అయిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వేణుగోపాలపురం డైట్ ప్రిన్సిపల్ తిరుపతినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ డైట్, డీఈఎల్ఈడీ కళాశాలల్లో 2015 నుంచి 2020 వరకు డైట్ చదివి రెగ్యులర్ సబ్జెక్టులతో పాటు ప్రాక్టికల్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే 2021 - 23 రెగ్యులర్ విద్యార్థులకు రెండో సెమిస్టర్ ప్రాక్టికల్ పరీక్షలు అవే తేదీల్లో జరుగుతాయన్నారు.

విస్తృత సేవలకు కార్యాచరణ



రోటరీ ఆధ్వర్యంలో తయారు చేసిన గుడ్డ సంచులను ఆవిష్కరిస్తున్న క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కృష్ణశాంతి, తదితరులు

• రోటరీ క్లబ్ నూతన అధ్యక్షురాలు డాక్టర్ కె.కృష్ణశాంతి

విజయనగరం: రోటరీ ద్వారా సామాజిక సంక్షేమ కార్యక్రమాలు ఈ ఏడాది మరింత విస్తృతం చేయనున్నట్లు విజయనగరం రోటరీ ప్రధాన క్లబ్ నూతన అధ్యక్షురాలు డాక్టర్ కె. కృష్ణశాంతి అన్నారు. సోమవారం స్థానిక రోటరీ సామాజిక భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఏడాదీ రోటరీ సంస్థచే నిర్వహించబడుతున్న సేవా, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూనే ఈ ఏడాది మరిన్ని కార్యక్రమాలను అదనంగా చేపట్టేందుకు కార్యచరణ సిద్ధం చేశామన్నారు. సామాన్య, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన డయాబెటిస్ రోగుల కోసం ప్రత్యేకంగా రోటరీ డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. పట్టణ ప్రజలకు రోటరీ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తం అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. వివిధ కారణాలవల్ల డిప్రెషన్‌కు గురవుతున్న గృహిణులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి మహిళల ఆత్మహత్యల కట్టడికి కృషి చేస్తామన్నారు. కంటి రోగుల కోసం సంచార నేత్ర చికిత్సాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. పేద, మధ్య తరగతి మహిళలకు వృత్తి విద్యా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి టైలరింగ్, తదితర చేతి వృత్తులలో శిక్షణ అందిస్తామన్నారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో తయారుచేసిన గుడ్డ సంచులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రోటరీ పూర్వపు గవర్నర్ ఆర్కే జైన్, రోటరీ పూర్వపు అధ్యక్షుడు డాక్టర్ కె.తిరుమల ప్రసాద్, ప్రవీణ్‌కుమార్ అంచాలియా, నూతన కార్యదర్శి నీతు విజ్వానీ, ప్రతినిధులు బి. సూర్యలక్ష్మి, ఉసిరికల చంద్రశేఖర్, బలబద్రుని నానాజీ, మాటూరు మురళీకృష్ణ, డాక్టర్ పద్మకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సేవా మార్గంలో నడవాలి

విజయనగరం టౌన్: యువత సేవా మార్గంలో నడవాలని విశ్వబ్రాహ్మణ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుపోజు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రంగిరీజు వీధిలో ఉన్న అసోసియేషన్ కార్యాలయం వద్ద ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.50 వేల రూపాయల వ్యయంతో ఏడాది పొడవునా తాగునీరందించేందుకు సోమవారం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంస్థ కార్యవర్గ సభ్యుడు కురుమోజు శివ తన తండ్రి వర్ధంతిని పురస్కరించుకుని వంద మందికి బిర్యానీ, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింతాడ వెంకటసురేష్, నల్లబాటి కుమార్, శివ, సంతోష్‌కుమార్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కొండవెలగాడలో గడప గడపకు...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పాటు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిబాల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభంకానున్న కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: పార్వతీపురం ఆస్పత్రిలోని ఎన్‌సీడీ విభాగంలో డిస్ట్రిక్ క్వాలిటీ మోనటర్ పోస్టుకు ప్రొవిజినల్ మెరిట్ జాబితాను విజయనగరంఏపీ.జీఓవి.ఇన్‌లో పొందుపరిచినట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు.